


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 24-6-2025

సంపుటి: 21 సంచిక: 78
పేజీలు: 8 వెల: రూ.1

# గార రాజకీయాల్లో మరో 'మార్పు'?

- ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన రామారావు కుమార్తె
- రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం సూపర్ బజార్ మాజీ చైర్మన్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ లాంటి ఎన్నో పదవులను నిర్వహించిన దివంగత మార్పు రామారావు కుటుంబం నుంచి ఆయన రాజకీయ వారసత్వం అందుకోడానికి మొదటిసారిగా ఆయన కుమార్తె ముందుకొచ్చినట్లు కనిపిస్తుంది. గార మండలాన్ని శాసించిన మార్పు రామారావు తదనంతరం ఆయన సోదరుడు మార్పు ధర్మా రావు రాజకీయా ల్లోకి వచ్చారు. ధర్మాన ప్రసాద రావు అనుచరుడిగా ఉన్న రామారావు మాదిరిగానే ఆయన సోదరుడు ధర్మారావు కూడా వైకాపా నాయకుడిగా పని చేస్తున్నారు. ఆయన భార్య సుజాత ప్రస్తుత జడ్పీటీసీ కాగా, తనయుడు పృథ్వీ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఇంత వరకు మార్పు రామారావు కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లో అడుగు పెట్టలేదు. నాలుగు రోజుల క్రితం రామారావు కుమార్తె లావణ్య స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిశారు. భవిష్యత్తులో తెలుగుదేశం కోసం పనిచేసే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇంత వరకు విదేశాల్లో ఉన్న లావణ్య కొన్నేళ్ల క్రితం నాతవలస వద్ద ఓ స్టార్టప్‌ను ఏర్పాటుచేసుకొని వ్యాపారం చేస్తున్నారు. విశాఖపట్నం రోటరీ అధ్యక్షురాలిగా పని చేసిన లావణ్య అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పని చేస్తున్న విషయం విశాఖవాసులకు తెలుసు. అయితే తొలిసారిగా ఆమె రాజకీయ ఆరంగేట్రం పై ఊహాగానాలు మొదలయ్యాయి. ఎమ్మెల్యేను కలిసినవారిలో లావణ్యతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు దొండపాటి నవీన్‌కుమార్, అడ్వకేట్ ధనుంజయ, లొట్టి జగన్‌లు ఉన్నారు.

# యాడ దొరికిన సంతరా మీరంతా!

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగులంతా 2 గ్రూపులు
- రోజూ తిట్లు, శాపనార్థాలు
- ఏవో బాబూరావుపై ఫిర్యాదు
- ఫైల్స్ కదలక తటస్థుల పాట్లు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తన కింద పనిచేసే మహిళా ఉద్యోగినికి రీపోస్టింగ్ (దీర్ఘకాల సెలవు అనంతరం) ఇవ్వడానికి రూ.20వేలు లంచం తీసుకుంటూ స్వయంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో పాటు ఆయన దగ్గర సీసీగా పని చేసిన ఉద్యోగి కూడా అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయినా ఈ శాఖ ఉద్యోగుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. అంతకు ముందు ప్రభుత్వ నోటిఫికేషన్ మేరకు ఉద్యోగాల భర్తీలో అనేక అవకతవకలకు పాల్పడ్డారని కొందరు ఉద్యోగులపై స్వయంగా అప్పటి డీఎంహెచ్‌వోనే టూటౌన్‌లో కంప్లైంట్ ఇవ్వడం, దీని మీద క్రిమినల్ కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నా మిగిలినవారిలో ఏమాత్రం భయం కనిపించడంలేదు. అన్నింటికంటే ముందు ఈ శాఖలో పనిచేసిన అనేక మంది ఉద్యోగులపై ఏసీబీ ఛార్జెస్ ఉన్నా ఏం కాదులే అన్న భావనతో ఇప్పుడున్న ఉద్యోగులు వ్యవహరించడం కొసమెరుపు. అన్నిటికీ మించి ఇక్కడ డీఎంహెచ్‌వోలుగా పనిచేసిన ముగ్గురు అధికారులకు ఇప్పటికీ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సెటిల్ కాకుండా పెన్షన్ అందుకోలేకపోతున్నారని తెలిసినా ఎక్కడా తగ్గేదే లే అంటున్నారు. జిల్లాలో ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న విభాగంగా వైద్యఆరోగ్య శాఖ కీలకమైనది. కాబట్టి ఇక్కడ ప్రతీ సీటు కాసులు కురిపించేదే. అందుకే సొమ్ములు పంచుకోవడంలోను, దండుకోవడంలోను తేడాలు రావడం వల్ల కార్యాలయంలో స్వయంగా డీఎంహెచ్‌వో ఛాంబర్ ఎదుటే ఒకరిపై ఒకరు బాహాబాహీకి దిగుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మినిస్టీరియల్ ఉద్యోగులు రెండు గ్రూపులుగా విడిపోయి నిత్యం ఒకరిపై ఒకరు పెద్ద ఎత్తున కేకలు వేసుకుంటూ సంత మాదిరిగా తయారుచేశారు. అక్కడితో ఆగకుండా ఇక్కడి నుంచి బదిలీ చేయించాలన్న కోణంలో ఒక వర్గంపై మరొక వర్గం ఫిర్యాదులు చేసుకుంటోంది. డీఎంహెచ్‌వో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాబూరావు, అకౌంట్స్ విభాగం సూపరింటెండెంట్ శివకుమార్, ఎల్‌డీ కంప్యూటర్ హోదాలో జూనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్న ఉదయ్‌కుమార్‌ల బృందం ఒక గ్రూప్ కాగా, సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్‌తో పాటు మరి కొందరు మినిస్టీరియల్ ఉద్యోగులు ఒక గ్రూపుగా ఏర్పడి చొక్కాలు పట్టుకొంటున్నారు. చివరకు ఈ వ్యవహారం వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్‌కు చేరింది. ఏవో బాబూరావు సవ్యంగా విధులకు రారని, ఆయన సీటులో ఎప్పుడూ ఉండరుసరికదా, మిగిలిన ఉద్యోగులపై చిర్రుబుర్రులాడుతూ దుర్భాషలాడుతారంటూ ఒక ఫిర్యాదును ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు భాస్కర్ కుమార్ వర్గం బాబూరావుపై ఒక ఫిర్యాదును అందించింది. దీనిపై ప్రజాగ్రీవెన్స్‌కు సిఫార్సు చేస్తూ కూన రవి కుమార్ లేఖ పంపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డీఎంహెచ్‌వోకు లేఖ రాశారు. అయితే ఇది తన పరిధి లోకి రాదని, దీనిపై చర్యలు తీసుకోవాల్సింది వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టరేనంటూ కలెక్టర్ లేఖను అక్కడకు పంపారు. ప్రస్తుతం ఇక్కడ ఎటువంటి చర్యలకు సిఫార్సు చేశారన్నది తేలాల్సివుంది. అవినీతి అంశం పక్కనపెడితే బాబూరావు సీటులో ఉండటం

- మిగతా చివరి పేజీలో



# వ్యక్తిగత గోప్యతకు పెరుగుతున్న సవాళ్లు

## 160 కోట్ల మందికి సంబంధించిన డేటా చోరీ..



ది వైర్ నుంచి..

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో రమేష్ (పేరు మార్చాం) అనే విద్యార్థి ఓ ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో చివరి సంవత్సరం పరీక్షలు రాసి సొంతూరు వెళ్లటానికి బ్యాగులు సర్దుకుంటున్నాడు. ఆ సమయంలో తన కళాశాల యాజమాన్యం నుంచి ఆ విద్యార్థికి ఫోన్ వచ్చింది. అయితే, ఎవరో ఒక అగంతకుడు ఆ కళాశాలలో బోధిస్తున్న ఓ అధ్యాపకురాలికి అశ్లీల మెసేజ్‌లు పంపిస్తున్నాడు. ఆ అధ్యాపకురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రాయ్‌పూర్ సైబర్ క్రైం పోలీసు విభాగం దర్యాప్తు చేశారు. దర్యాప్తులో అశ్లీల మెసేజ్‌లు పంపటానికి ఉపయోగించిన మొబైల్ సిమ్‌కార్డు ఈ విద్యార్థి ఆధార్ కార్డుతో లింక్ చేసి ఉన్నట్లు తెలిసింది. దాంతో కళాశాల యాజమాన్యం, పోలీసులు ఆ విద్యార్థిని పిలిచి కాస్తంత తీవ్ర స్థాయిలోనే ఇంటరాగేట్ చేశారు. పిలిచినప్పుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి హాజరు కావాలని షరతు విధించారు.

మరో ఘటన మరింత ఆసక్తికరమైనది. ఈ వార్త రాస్తున్న విలేకరికి గత రెండు సంవత్సరాలుగా లండన్ హీత్రు విమానాశ్రయం ఆఫీస్ పేరుతోనో, దుబాయి అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతోనో, ఫెడెక్స్ కొరియర్ లండన్ కేంద్రం పేరుతోనో ఫోన్లు వచ్చేవి. అన్ని ఫోన్ పిలుపుల సారాంశం ఒక్కటే. ఈ విలేకరి పంపిన కొరియర్ విమానాశ్రయంలో పడివుందని, దాని గురించి వివరాలు తెలుసుకోవడానికి కాల్ చేస్తున్నామన్నది ఆ సారాంశం. మరికొన్ని సార్లు ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం కస్టమ్స్ కేంద్రం నుంచి కూడా ఫోన్ వచ్చింది. 'ఫలానా ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నాను, మీరు అర్జంట్‌గా ఢిల్లీ విమానాశ్రయంలో ఉన్న కస్టమ్స్ ఆఫీసుకు రావాలి. మీ పేరుతో ఉన్న కొరియర్ ప్యాకెట్‌లో మాదకద్రవ్యాలు దొరికాయి. మీరు రాకపోతే అరెస్టు చేసుకుని తీసుకురావాల్సి ఉంటుంది' అని అన్నారు.

ఇలాంటి అనుభవాలు పాఠకుల్లో కూడా చాలామందికి ఎదురై ఉంటాయి. గమ్మత్తయిన విషయం ఏమిటంటే.. ఇలాంటి కాల్స్ వచ్చిన ముందు కానీ, తర్వాత కానీ టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఒక మెసేజ్ వస్తుంది. 'రకరకాల పేర్లతో మిమ్మలను మోసం చేయటానికి డిజిటల్ రంగంలో అనేక మంది ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చిన ఫోన్లకు స్పందించవద్దు. అంతర్జాతీయ కోడ్ నెంబర్‌లతోనో మరో రకమైన ముసుగులోనో వచ్చే నంబర్లకు స్పందించవద్దు' అని ఆ కాల్ లేదా మేసేజ్ సారాంశంగా ఉంటుంది. అలాని మనం రకరకాల కాల్ సెంటర్ల నుంచి వచ్చే ఫోన్లకు స్పందించకుండా ఉందామా అంటే అదీ కుదరదు. ఉదాహరణకు ఏదైనా బ్యాంక్ ద్వారా ఆన్‌లైన్ ఖాతా నుంచి గణనీయమైన మొత్తాన్ని మనమే మనకు తెలిసిన వాళ్లకు పంపితే, వెంటనే అలా పంపించినది మీరా కాదాని ధ్రువీకరించుకోవడానికి బ్యాంకులకు సంబంధించిన కాల్ సెంటర్ల నుంచి ఫోన్లు వస్తాయి. అవి కొత్త నెంబర్లు. టెలికం రెగ్యులేటరీ అథారిటీ వారి మాటలు నమ్మి మనం ఆ కాల్స్‌కు స్పందించకపోతే మనం చేసిన బ్యాంకు లావాదేవీలు వివాదస్పదంగా మారుతాయి. లేనిపోని తలనొప్పులు తెచ్చిపెడతాయి. ఇకపోతే అలాంటి కాల్స్‌కు స్పందించడం మొదలుపెట్టామా, ఈ ఆన్‌లైన్ స్పామ్ ట్రోలింగ్‌కు భరించక తప్పదు.

### ఇలా ఎందుకు జరుగుతుంది?

దీనికి సమాధానాలు తెలుసుకోవాలంటే కాస్తంత రోజు వారీ జీవితంలో మనం చేసే పనులు, మనం అలా చేయాల్సిన పరిస్థితులను కల్పించిన ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవాలి. మనకు రోజువారీ వ్యవహారాల్లో ఎదురయ్యే కొన్ని విషయాలను గమనిస్తే.. విమాన ప్రయాణం చేయాలంటే టిక్కెట్టు కొనేటపుడు ఆధార్ కార్డు ఇవ్వాలి. ఏదైనా ప్రభుత్వ శాఖలో పని కోసం వెళ్తే ఆధార్ కార్డు ఇవ్వాలి. కోర్టులో కేసు వేయాలంటే కక్షిదారులు తమ ఆధార్ కార్డులు కూడా జత చేయాలి. ఫోన్ కొనాలన్నా, ఆన్‌లైన్‌లో బిల్లు కట్టే పద్ధతిలో చేరాలన్నా, సిమ్‌కార్డు కొనాలన్నా కచ్చితంగా ఆధార్ కార్డును జత చెయ్యాలి.

దేశంలో జరిగే ప్రతి పనికీ ఆధార్ కార్డు అనుసంధానం చేయాలన్న షరతును కేంద్ర ప్రభుత్వం విధించింది. అలాంటి పనికి ఆధార్ కార్డు వివరాలు అవసరమా లేదా అన్నదాంతో పని లేదు. కానీ చివరకు చచ్చిన మనిషి శవాన్ని కాల్చాలన్నా ఆధార్ కార్డుతోనే వైకుంఠ సేవలు బుక్ చేసుకోవాల్సి వస్తోంది. తాజా ఎన్నికల్లో ఉపయోగించే ఓటర్ గుర్తింపు కార్డును కూడా ఆధార్ కార్డుతో జత చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజా రైల్వే టికెట్ల బుకింగ్‌కు కూడా ఆధార్ కార్డు అవసరం తప్పనిసరి చేయనున్నారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన్‌ధన్ యోజన పథకంలో భాగంగా ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ అనుసంధానం జరిగిపోయింది.

### అవసరం లేకున్నా అనివార్యంగా..

ఈ విధంగా అవసరం ఉన్నా లేకున్నా ఆధార్ కార్డు, మొబైల్ నంబర్లతో మనిషి జీవితం అనుసంధానించబడి ఉండటం, ప్రస్తుతం కోట్లాది సంఖ్యలో ప్రజల చేతుల్లో ఇంటర్నెట్ సౌలభ్యం ఉండటంతో కోట్ల మందికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ఉన్న సందర్భాలు, సెల్ఫీల రూపంలో తీసుకుని ఆండ్రాయిడ్ ఫోన్‌లలో భద్రపర్చుకున్న ఫోటోలు, ఆండ్రాయిడ్ ఫోన్లు పట్టుకుని మనం తిరిగిన ప్రాంతాలు, ఫేస్‌బుక్‌లో మన చర్చలు, మిత్రులు, మనం చూసే వీడియోలు, వాటి స్వభావం వంటి అత్యంత సున్నితమైన వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన వివరాలు అన్నీ రవీ, కవీ కాంచని చోటైన డిజిటల్ స్పేస్ వరకు చేరుతున్నాయి.

ఈ వివరాలు అన్నీ భద్రంగా ఉంచాలని పదేపదే రోజుకు పది సార్లు ఫోన్‌లో మెసేజ్‌లో పంపే ప్రభుత్వాలు మాత్రం, కోటానుకోట్ల మంది ప్రజల వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా భద్రం చేయటం, దుర్వినియోగం కాకుండా చూడటంలో దారుణంగా విఫలమవుతున్నాయి.


ఉదాహరణకు మన బ్యాంకు ఖాతాలు – ఆధార్ నంబర్‌లు, ప్రపంచాన్ని పిడికిట్లో బంధించండనే రిలయన్స్ కంపెనీ నినాదంతో, ఒక ఐడియా మీ జీవితాన్ని మార్చేస్తుంది అన్న ఐడియా సెల్యులార్ సిమ్‌కార్డులతో, నిను వీడని నీడను నేనే అన్నట్టు కుక్కలా మన వెంట ఉండే హచ్ కంపెనీ సిమ్‌కార్డుల ద్వారా చేతుల్లోని ఆండ్రాయిడ్ ఫోన్లకు వచ్చి వాలాయి. దాంతో ఎవరి ఖాతాలో ఎక్కువ డబ్బులు ఉన్నాయని పసిగడుతున్న హ్యాకర్లు వాళ్లకు రకరకాల రూపాల్లో ఫోన్లు చేసి వాళ్లను కాల్‌లో నిలువరించి ఆ సమయంలో బ్యాంక్ ఖాతాల్లో ఉన్న సొమ్ము దోచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండంచెల, మూడంచెల పాస్‌వర్డ్‌లు వన్ టైమ్ వెరిఫికేషన్ పాస్వర్డ్‌లు ఎన్ని ఉన్నా, వినియోగదారుల వ్యక్తిగత గోప్యత హ్యాకర్ల చేతివాటానికి బలి కాకుండా ఆపలేకపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందికి సంబంధించిన వ్యక్తిగత వివరాలు అంతర్జాతీయ హ్యాకర్ల బారిన పడిందన్న వార్త మరింత ఆందోళన కలిగించేదిగా ఉంది.

### అతి పెద్ద డిజిటల్ చోరీ..

ప్రపంచ ఇంటర్నెట్ చరిత్రలో అతిపెద్ద డిజిటల్ చోరీ నమోదు అయినట్లు ఫోర్బ్స్ పత్రిక కథనం వెల్లడించింది. కీపర్ సెక్యూరిటీ నివేదికను ప్రస్తావిస్తూ ఫోర్బ్స్ 160 కోట్ల మందికి సంబంధించిన డిజిటల్ సెక్యూరిటీ వివరాలు– పాస్వర్డ్‌లు, లాగిన్ వివరాలు, పిన్ నంబర్లు, వన్ టైమ్ పాస్వర్డ్‌లు వంటి వివరాలు చోరీ అయ్యాయని ఈ పత్రిక కథనం వెల్లడించింది. యాపిల్, ఫేస్‌బుక్, గూగుల్, గిట్ హబ్, టెలిగ్రాం వంటి డిజిటల్ అప్లికేషన్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఖాతాదారులు, వినియోగదారుల వివరాలు చోరీ అయ్యాయి.

వివిధ డిజిటల్ సెక్యూరిటీ రంగ నిపుణులు, పరిశోధకులు చేపట్టిన పరిశోధన ప్రకారం కోటి నుంచి మూడున్నర కోట్ల మందికి చెందిన 30 డేటా సెట్‌లు చోరీకి గురి అయినవాటిలో ఉన్నాయని తేలింది. ఈ విధంగా చోరీ అయిన వివరాలు ఏ రూపంలో దుర్వినియోగం అవుతాయన్న విషయంలో ఎవరూ భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. హ్యాకర్ల బారిన పడిన ఈ వ్యక్తిగత

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# యుద్ధం ఆగినట్లేనా?

ప్రపంచ పెద్దన్నగా చెప్పుకొంటున్న డోనాల్డ్ ట్రంప్ మరోసారి తన ఆధిపత్య ధోరణి ప్రదర్శించారు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య గత పన్నెండు రోజులుగా భీకరంగా సాగుతున్న యుద్ధం ముగిసినట్లు ఆ దేశాల ప్రమేయం లేకుండా.. తనకు తానుగానే ప్రకటించేసి ప్రపంచాన్నే విస్మయపరిచారు. ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫాం అయిన 'ట్రూత్'లో మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో ఒక పోస్ట్ పెట్టారు. ఇంతకుముందు భారత్–పాక్ విషయంలోనూ ట్రంప్ ఇదే వైఖరి అవలంభించిన విషయం గమనార్హం. పహల్గాం ఉగ్ర ఊచకోత నేపథ్యంలో పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో విరుచుకుపడటం.. అది మింగుడుపడని పాకిస్థాన్ భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలపై దాడులకు యత్నించగా.. భారత్ ప్రతిదాడులు చేయడంతో పాక్‌కు చెందిన తొమ్మిది వాయుసేన స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధంలో పాల్గొంటున్న భారత్, పాక్‌ల కంటే ముందే యుద్ధం ఆగిపోయిందని, రెండు దేశాలతో తానే మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించనని ప్రకటించుకున్నారు. ఆ తర్వాతే రెండు దేశాలు డీజీఎంఓల స్థాయిలో చర్చలు జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం తన ఘనతేనని ఇన్నాళ్లు ప్రచారం చేసుకున్న ట్రంప్ ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం విషయంలోనూ అదే పంథా అనుసరించారు. సోమవారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున) రెండు దేశాల మధ్య సంపూర్ణ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అయితే ఈ విషయాన్ని ఇరాన్, ఇజ్రాయెల్ మొదట ధ్రువీకరించలేదు. అమెరికా మద్దతుదారు అయిన ఇజ్రాయెల్ సంగతి పక్కనపెడితే ఇరాన్ మొదట ట్రంప్ ప్రకటనను ఖండించింది. అటువంటి ఒప్పందమేదీ కుదరలేదని స్పష్టం చేసిన ఇరాన్ తర్వాత కొద్దిసేపటికే కాల్పుల విరుమణ ఒప్పందం కుదిరినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇప్పటి నుంచి ఆరు గంటల తర్వాత ఇరాన్, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ పాటిస్తాయి. 12 గంటల పాటు ఇది అమల్లో ఉంటుంది. ఆ సమయంలో యుద్ధం ముగిసినట్టుగా పరిగణిస్తాం' అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. కాల్పుల విరమణ వచ్చే 24 గంటల్లో విడతల వారీగా అమలులోకి వస్తుందన్నారు. ఇజ్రాయెల్ సైన్యం గానీ, ప్రధాని కార్యాలయం గానీ దీనిపై ఇంకా స్పందించలేదు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా తమ దేశంలోని మూడు భూగర్భ అణు కేంద్రాలపై బంకర్‌బస్టర్ బాంబులతో దాడులకు పాల్పడి ధ్వంసం చేయడంపై ఇరాన్ రగిలిపోయింది. దానికి ఇంతకు ఇంతా ప్రతీకారం తీర్చుకుంటామని, దానికి సిద్ధంగా ఉండాలని అమెరికాను తీవ్రంగా హెచ్చరించింది. చెప్పినట్లుగానే పశ్చిమాసియాలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై గురిపెట్టింది. మొదట సిరియా, తర్వాత ఖతార్‌లోని అమెరికన్ స్థావరాలపై క్షిపణులతో దాడి చేసి నష్టపరిచింది. తమ దేశంలోని అల ఉదెయిద్ ఎయిర్ బేస్‌పై ఇరాన్ 19 క్షిపణులు ప్రయోగించిందని ఖతార్ జనరల్ షాయెక్ అల్ హజ్రీ వెల్లడించారు. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి మినహా మిగతావి లక్ష్యాన్ని ఛేదించలదేని ట్రంప్ ప్రకటించారు. ఏమైనా ఇరాన్ తనను కూడా టార్గెట్ చేయడంతో అణు కేంద్రాలను ధ్వంసం చేయడంతోనే ఆగిన అమెరికా ఇక నేరుగా యుద్ధంలోకి కూడా దిగుతుందని ఆందోళన వ్యక్తమైంది. మరోవైపు ప్రపంచ ఇంధన రవాణాలో 20 శాతం వాటా కలిగిన అతి కీలకమైన హార్మూజ్ జలసంధిని మూసివేయాలన్న నిర్ణయానికి ఇరాన్ పార్లమెంటు ఆమోదముద్ర వేయడం, మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్‌లకు మద్దతుగా పలు దేశాలు ఒక్కొక్కటిగా రంగంలోకి దిగుతాయన్న సంకేతాలు వెలువడుతున్న తరుణంలో మూడో ప్రపంచయుద్ధం తప్పదన్న ఆందోళన, ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంటుందని, ధరలు ఆకాశాన్నంటుతాయని భయపడుతున్న తరుణంలో కాల్పుల విరుమణకు రెండు దేశాలు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం, దాన్ని ఆలస్యంగానైనా ఇరాన్ ధ్రువీకరించడంతో దాదాపు ప్రపంచమంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది. ప్రపంచ యుద్ధానికి దారితీస్తున్న ఇరాన్–ఇజ్రాయెల్ ఘర్షణలు ఏదోవిధంగా ఆగితే చాలునన్న భావన అన్ని దేశాల్లోనూ నెలకొంది. అయితే ట్రంప్ పోస్టు ప్రకారం కాల్పుల విరమణకు పాటించాల్సిన మార్గదర్శకాలపై ఇరుదేశాల మధ్య చర్చలు జరగాల్సి ఉంది. ఆ చర్చల్లో ఆమోదయోగ్యమైన అంగీకారం కుదిరితేనే కాల్పుల విరమణ కొనసాగుతుంది. లేకుంటే దాడులు తప్పవన్నమాటే.

## ఐఐఐటీకు ఎంపికైన తమ్మినైన భవ్యశ్రీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని హయాతినగరంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన తమ్మినైన భవ్యశ్రీ 577 మార్కులతో పాఠశాల ప్రథమస్థానంతోపాటు శ్రీకాకుళం ఐఐఐటీకు ఎంపికైందని ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మి తెలియజేశారు. భవ్యశ్రీ సాధారణ రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి ఐఐఐటిలో సీటు సాధించినందుకు విద్యార్థి తల్లి తండ్రి జోగారావు, కృష్ణకుమారి ఆనందం వ్యక్తం చేశారు. తాడివలస గ్రామప్రజలు అభినందించారు.

## కూటమి ప్రభుత్వం.. ఇది మంచి ప్రభుత్వం

(సత్యంన్యూస్, అమరావతి)





తెలుగుదేశం, బీజేపీ, జనసేనపార్టీలు కూటమి ప్రభుత్వంగా ఏర్పడిన ఏడాది కాలంలో తన పనితీరుతో అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని పొందాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం అమరావతిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు సభలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొనటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా సాగించిన పాలన విమర్శకుల ప్రశంసలు అందుకుందన్నారు. ఈ చర్యలు రాబోయే కాలంలో మరింత సుస్థిరతకు మార్గం చూపుతాయనటంలో ఎటువంటి సందేహం లేదని, ప్రజల కోసం తీసుకున్న సంక్షేమ చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్యేకతను ఆపాదించుకున్నాయన్నారు. సంక్షేమం, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలు రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపాయని, ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల సంక్షేమానికి దోహదపడేలా ఉండటమే కాకుండా, వారి జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావడంలో విజయవంతమైందన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు.

**రైతుల సంక్షేమానికి పెద్దపీట**

దేశానికి వెన్నెముక రైతన్న అన్న విషయాన్ని గుర్తెరిగిన సీఎం చంద్రబాబునాయుడు రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల కోసం అనేక పథకాలు చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రూ.1,674కోట్ల ధాన్యం బకాయిలను చెల్లించడం ద్వారా రైతులకు భరోసా ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 55,57,525 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, మొత్తం 8,50,342మంది రైతులకు రూ.13,584కోట్ల ధాన్యం కొనుగోలు సాయం అందించామన్నారు. ధాన్యం రైతులకు గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1674కోట్లను కూడా అధికారంలోకి వచ్చిన రెండు నెలలో కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతుల అభివృద్ధికి 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను పంపిణీ చేశామని, పాడిరైతుల కోసం రూ.2లక్షల సబ్సిడీతో పాడి షెడ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించామన్నారు. మత్స్యకారులకు ఉపాధిని దెబ్బతీసే 217జీవోను రద్దు చేసి, మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20వేల ఆర్థిక సాయం కింద రూ.259కోట్ల రూపాయలు అందచేశామని, మామిడి పంటకు ప్రభుత్వం కేజీకి రూ.4లు సబ్సిడీ, కోకో పంట కేజీకి 50 రూపాయల సబ్సిడీని అందచేసి రైతులకు వెన్నంటే నిలబడ్డామని తెలిపారు. మార్కెఫెడ్ ఆధ్వర్యంలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత మన కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పడం సగర్వంగా ఉందన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున నగదును జమ చేశామన్నారు. కొద్దిరోజుల్లో రైతుల ఖాతాల్లో సుఖీభవ నగదు పడనుందన్నారు. రైతు సంక్షేమమే మా అభిమతమన్నారు. మహిళలకు ఆగస్టు 15 నుండి ఉచిత బస్ సర్వీసులు ప్రారంభమవుతాయని, ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబునాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు.

## యువత పోరులో యువత లేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




వైకాపా చేపట్టిన యువత పోరులో అసలు యువతే లేరని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ ఆరోపించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైకాపా నాయకులు అడిగినట్లే వారికి ఒక్క అవకాశమే ఇచ్చి ప్రజలు మోసపోయారన్నారు. వైకాపా ఇక ఉన్న వారితోనే ప్రజలు, యువత మద్దతు, అండ లేని పోరుబాట, నిజాయితీ, మానవత్వం లేని యాత్రలు చేసుకోవాల్సిందేనన్నారు. ప్రజల ఆకాంక్ష, ఆశయాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య బద్ధంగా కూటమి ప్రభుత్వ సంవత్సర పాలన సాగిందన్నారు. ప్రజల నమ్మకానికి విశ్వాసానికి వేటు వేసిన వైసీపీదే అసలైన వెన్నుపోటన్నారు. యువతను అన్ని విధాలుగా వాడుకొని వదిలేసి దగా, మోసం చేసిన పార్టీ వైకాపాయేనన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున దుష్ప్రచారం దయ్యాల వేదాలు వెల్లించినట్టే ఉందన్నారు. జూన్ 4న చేసిన వెన్నుపోటు కార్యక్రమం కానీ, సోమవారం నిర్వహించిన యువత పోరులో గాని ప్రజలు, యువత మద్దతు వారికి లేక భారీ ఎత్తున ప్రచారం చేసి బ్లాక్ బస్టర్ అవకుండా డిజాస్టర్ అయిన మూవీలా ఉన్నాయన్నారు.

## ఈనెల 28న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు జరగనుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎల్ఎన్వి శ్రీధర్ రాజా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపరిషత్ నూతన సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశాన్ని గౌరవ అధ్యక్షులు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని, సమావేశానికి సంబంధించి సంబంధిత ప్రజాప్రతినిధులు అందరికీ ఎజెండా అంశాలను పంపించినట్లు తెలిపారు.

# కుభేరకు 13 ప్రశ్నలు!





కుబేర చూసాను. పెద్దగా నచ్చలేదు. యావరేజ్‌గా అనిపించింది. సమీక్షలన్నీ పాజిటివ్‌గా, ఆహా, ఓహెూ అంటూ వచ్చాయి. నేను సినిమా సరిగ్గా చూడలేదా? శేఖర్ కమ్ముల మీద ఉన్న సానుకూల దృక్పథం సమీక్షల మీద పని చేసిందా అనేది అర్థం కాలేదు. వేరే కమర్షియల్ డైరెక్టర్ అయితే ఈ వ్యాసం రాయాల్సిన పనిలేదు. శేఖర్ కమ్ముల సెన్సిటివ్ దర్శకుడు, సూక్ష్మమైన భావనలని కూడా తెరమీద ఆవిష్కరించే క్రియేటివ్ జీనియస్. మరి ఆయన నుంచి ఇలాంటి లాజిక్ లేని ఓవర్ సినిమా లిబర్టీ మూవీ రావడం ఆశ్చర్యం. తనది కాని చెప్పుల్లో కాలు పెట్టారు. క్రైం థ్రిల్లర్ ఆయన జానర్ కాదు. ఈ కథని ఎన్నేళ్లు రాసుకున్నారు, ఎన్ని గంటల నిడివి తీసారన్నది ముఖ్యం కాదు. ప్రేక్షకుడు ఏం చూసాడన్నదే ప్రధానం.కుబేరాలో నాకు వచ్చిన సందేహాలు. ఇది నా అజ్ఞానం కూడా కావచ్చు. అజ్ఞానమే అందరికీ శ్రీరామ రక్ష

\- జీఆర్ మహర్షి

1.బంగాళాఖాతంలో ఆయిల్ పడుతుంది. దాన్ని స్వాధీనం చేసుకోడానికి నీరజ్ అనే వ్యాపారి ప్రభుత్వ పెద్దలకి లక్ష కోట్లు లంచం ఇవ్వడానికి సిద్ధమవుతాడు. నీరజ్ ఎవరు? దేశంలో ఆయన్ని తెలియని వారు లేరు. లక్ష మంది ఉద్యోగులున్న కంపెనీలకీ యజమాని. ఆయన కింద ఎంతమంది చార్టెర్డ్ అకౌంటెంట్‌లు వుంటారో, ఏ రేంజ్ ఫైనాన్స్ నిపుణులు వుంటారో ఊహించుకోవచ్చు. ఆ రేంజ్‌కి చేరుకోవాలంటే గవర్నమెంట్‌లో ఎందరిని మేనేజ్ చేయాలో, ఎలా చేయాలో తెలియని అమాయకుడు కాదు. అయినా కొత్తగా ఏదో డీల్ వచ్చినట్టు, తండ్రి చెప్పిన మాటలు విని, జైల్లో ఉన్న సీబీఐ అధికారిని, కేసు నుంచి విడిపించి మరీ లక్షకోట్ల డీల్ అప్ప చెబుతాడు. డబ్బులిస్తే అన్ని విలువల్ని వదిలేసుకునే సమస్త యంత్రాంగం చుట్టూ వుంటే, అందర్నీ వదిలి, విలువల గురించి మాట్లాడే నాగార్జునను తెచ్చుకుని, కొరివితో తల గోక్కుంటాడా? సినిమాటిక్ లిబర్టీ అంటారా! ఓకే, డన్.

2.నాగార్జున విషయానికి వద్దాం. సీబీఐ అధికారి కావాలంటే చాలా చదివి వుండాలి. అధికారం ఉన్నపుడు విలువలకి కట్టుబడి వుండాలంటే చాలా నైతిక శక్తి కావాలి. నీరజ్ ఎంత శక్తిమంతుడో తెలిసి కూడా , దాడి చేసి ఫైన్ కట్టించాడంటే ఎంతో నిబద్ధత కావాలి. ముక్కుసూటిగా పనిచేస్తే ఎన్ని శక్తులు తనమీద పగ పడతాయో తెలియని అమాయకుడు కాదు. అయినా నిజాయితీగా చేసి జైలుకెళ్లాడు. కోర్టులో న్యాయం జరగలేదు. భార్యాబిడ్డల వైపు మొగ్గి, నీరజ్‌కు లొంగిపోయాడు. మనీల్యాండరింగ్, షెల్ కంపెనీలు, ఫైనాన్స్ ఎక్స్‌ఫర్ట్‌ల పని. కానీ నీరజ్ గొర్రెలా సీబీఐ మాజీ అధికారిని ఎంచుకున్నాడు. సినిమా లిబర్టీ ఓకే. నాగార్జున చేసిందేమంటే నలుగురు బిచ్చగాళ్లని వెతికి పట్టుకోవడం. దీనికి నలుగురు ఎందుకు? ఒకడితోనే లాగించొచ్చు. కానీ క్లైమాక్స్‌కి ఖుష్బు, ఆమె కొడుకు అవసరం. ఇది దర్శకుడి లిబర్టీ. బిచ్చగాళ్లని తెచ్చి , కటింగ్ చేసి, గడ్డాలు తీసి, కోటు వేసి, సీఈవోని చేసి రోబో అనే వాడి చేతిలో హత్య చేయించడం ఇదంతా ఓవర్‌గా లేదా? శేఖర్ కమ్ములకి తెలియనిది ఏమంటే డబ్బున్న వాళ్లంతా డ్రైవర్లని, తోటమాలీలు, వాచ్‌మెన్లని బినామీలుగా పెట్టుకుంటారు. దోవలో పోయే బిచ్చగాళ్లని ట్రైనింగ్ చేయించరు. నీ పేరు మీద క్షణాల్లో కోటి రూపాయిలు బ్యాంక్ బ్యాలెన్స్ సృష్టించి, అమెరికా ప్రయాణం చేయించగల నిపుణులు అమీర్‌పేటలోనే ఉన్నారు. అబిడ్స్, కోఠిలో మామూలు వ్యాపారులకి కూడా హవాలా, మనీ ల్యాండరింగ్ తెలుసు. శేఖర్ సార్ పద్మారావునగర్‌లో వుండి, అదే ప్రపంచం అనుకుంటున్నారు.

3.ధనుష్ ఒక బిచ్చగాడు. చదువులేదు కానీ, తెలివి వుంది. జ్ఞాపక శక్తి వుంది. మనిషిగా విలువలున్నాయి. బాల్యం ఒక గాయం. అలాంటి వాడు కష్టపడి పని చేసుకుంటాడు కానీ, బిచ్చగాడిగా ఎందుకుంటాడు? మరుజన్మలో బిచ్చగాడిగా వుండడానికే ఇష్టపడని వాడు , ఇపుడు బిచ్చగాడిగా ఎందుకున్నాడు? ఉన్నాడనే అనుకుంటే ఎవరో ముక్కూమొహం తెలియని వాళ్లు, డబ్బులిస్తామని చెబితే వెళ్తాడా? సూటుబూటు వేసి, సంతకం చేయమంటే తెలివైన వాడికి కొంచెమైనా అనుమానం రాదా? రాలేదనే అనుకుందాం. ఇంతకీ అతని డబ్బు ఎందుకు ట్రాన్స్‌ఫర్ కాలేదు?

4.ఇవన్నీ పక్కన పెడితే, ఓల్డ్‌మాంక్ పేరు చెప్పి ఎవడైనా ప్లాట్‌లోకి వెళ్లగలిగే ఇంట్లో బోలెడు డబ్బు, బంగారం దాచిన అధికారి ఎంత అమాయకుడు? అసలు అతని కథ ఏంటి?

5.బ్యాంకింగ్ అవగాహనే లేని ధనుష్ ఒక ట్రక్కు నిండా నోట్ల కట్టలని విలన్ ఇంటి ముందు ఎలా వేసాడు?

6.నంబర్ వన్ బిజినెస్ టైకూన్, ఒక బిచ్చగాడిని హ్యాండిల్ చేయలేక బిచ్చగాడిగా మారిపోతాడా?

7.ఎవరో తెలియని ఖుష్బూని రక్షించిన నాగార్జున ఒక సిన్సియర్ పోలీస్ అధికారి షాయాజీ షిండేని ఎందుకు కాల్చి చంపుతాడు?

8.సినిమాలో రష్మికనే కొంచెం సహజంగా వుంది. కానీ బిచ్చగాడిని నమ్మి అన్ని రిస్కులు తీసుకోవడం కొంచెం అసహజం.

9.శేఖర్ కమ్ముల ఒక కంగాళీ సినిమాని తీస్తే, కారణాలు ఏమైతేనేం అందరూ భుజాలకెత్తుకుంటున్నారు. నా లాంటి అజ్ఞానులకే సమస్య.

10.చివరిగా ...శేఖర్ సార్ మీ అభిమానిగా చెబుతున్నా. మీరొక మంచి సినిమా తీయాలనుకుని తీయలేకపోయారు. ఆహా, ఓహో భుజకీర్తుల్ని నమ్మకండి. అవి దేవతా వస్త్రాలు.

11.ధనుష్ నోట్ల కట్టలు ఇచ్చి, అంతిమ యాత్ర చేసినా, బండెడు నోట్ల కట్టలు రోడ్డు మీద కుమ్మరించినా, మీడియా, సోషల్ మీడియా ఏమై పోయాయి? అసలు ఈ సినిమా ఏ కాలం నాటిది?

12.డబ్బున్న వాళ్లదే న్యాయం. వాళ్లు పేదవాళ్లతో ఆడుకుంటారు, వాడుకుంటారు. నిజమే. టికెట్ రేట్లని పెంచి మీరు చేస్తున్నదేంటి? దోపిడీ కాకుండా వేరే పదం ఏమైనా వుందా?

13.శేఖర్ కమ్ముల రూ.150 కోట్లతో జూదం ఆడారు. మీరు మంచి అటగాడే కానీ ముక్కలు పడలేదు.

**Next time better luck**




# సమాజహితమే..
# సత్యాన్వేషణకి అర్థం!

హిమాచల్ రాష్ట్రంలో మారుమూల తానేదార్ అనే గ్రామంలో చుట్టూ ఆపిల్ తోటల మధ్యన ఒక చిన్న కొండ మీద ఉన్న ఓ వందేళ్ల క్రితం స్థాపించబడిన గుడికి నేను వెతుక్కుంటూ వెళ్ళాను. నిజానికి అది పేరుకు దేవాలయమే కానీ అందులో ఏ దేవుడూ ఉండడు. అసలలాంటి ఆలయం మరే దేశంలోనూ ఉన్నట్టు నాకు తెలియదు. భారత దేశానికి క్రైస్తవ మత ప్రచారానికని వొచ్చి, తత్వజ్ఞానంపై వ్యామోహంతో ఆర్య సమాజ సాహిత్యాన్ని, వేదవేదాంగాల్ని అధ్యయనం చేసి సకల మతాల సారాన్ని గ్రహించి హిందూ మతం స్వీకరించి, విశ్వ మానవ మతం అదేదైన ఒక్కటే నని ప్రకటించి ఒక విశ్వనరుడు నిర్మించిన "పరంజ్యోతి ఆలయం" అది. విప్లవాత్మక 'క్వేకర్' క్రైస్తవ శాఖకు చెందిన ఒక బడా వ్యాపారవేత్త కుమారుడు, యవ్వనంలో ఏదో అన్వేషిస్తూ పరదేశం లోకి ప్రవేశించిన నవ యువకుడు అక్కడి పరిస్థితులు, పేద ప్రజల మీద జరుగుతున్న దోపిడీ, పీడనలకి వ్యతిరేకంగా నిలిచి తన వేష భాషలు మార్చుకుని స్థానిక యువతిని వివాహం చేసుకుని భారతీయతలోకి ప్రవేశించిన ఒక మహావ్యక్తి చరిత్ర ఆ ఆలయం నేపథ్యం.

ఎక్కడి అమెరికా, ఎక్కడి హిమాచల్ ప్రదేశ్. ఎందుకోసం వొచ్చాడు. ఈ దేశానికి ఎన్నెన్ని అరుదైన విశిష్ట సంపద ఇచ్చాడు. ఇక్కడి ప్రజల జీవితాల్లో పాలుపంచుకున్నాడు. ఈ సంస్కృతిలో భాగమయ్యాడు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నాడు. ఆలిండియా కాంగ్రెస్ నాగపూర్ సెషన్ లో పాల్గొని భారత స్వాతంత్ర్య ప్రకటన మీద సంతకం చేసిన ఏకైక విదేశీ యుడు. ఒకే ఒక్క అమెరికన్. ఆనాటి వరకూ ఒక స్థిరమైన ఆదాయవనరు లేని హిమాచల్ ప్రదేశ్ ప్రాంతానికి తియ్యటి యాపిల్ పండ్లని సాగు చేసి చూపి ఏకంగా, "యాపిల్ రాజ్యం" చేశాడు. సిమ్లా ఆపిల్ అంటే ప్రపంచం అంతా నోరూరేలా ప్రసిద్ధి చెందేలా చేశాడు. స్టాక్స్, సత్యానంద్ స్టాక్స్. తిరుగు లేని సత్యాన్వేషణకి మరో రూపం. తిరోగమనం తెలీని ఆత్మగౌరవానికి అతడొక స్వరం. అందుకే ఈనాటికి హిమాచల్ యాపిల్ రైతాంగానికి, అక్కడి ప్రజానీకానికి ఆయన పేరు విన బడగానే అప్రయత్నంగానే శిరస్సు వంగుతుంది, చేతులు రెండు గౌరవసూచకంగా ఒక్కటై నమస్కరిస్తాయి. ఇంతకీ ఎవరీ స్టాక్స్.

క్రైస్తవ సంప్రదాయంలో క్వేకర్ ఉద్యమానిది విశిష్టమైన స్థానం. ఛాందస మత వైషమ్యం కాకుండా ప్రజా స్వామ్యం, శాంతియుత వైఖరిని పాటించే లక్షణాన్ని పెంపొందించుకున్న మార్గం. అలాంటి కుటుంబంలో ఆగస్టు 16,1882 అమెరికాలోని పెనిస్లేవియాలో గల ఫిలడెల్ఫియా లో శామ్యూల్ ఇవాన్ స్టాక్స్‌గా పుట్టాడు. చదువు, మత సంబంధిత విషయాలు ఎలాగూ ఉన్నాయి. అంతకు మించిన ఆసక్తి, కొత్త మనుషులు ప్రాంతాలపై చింతనతో సిమ్లా దగ్గర ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీలో సేవ చేయడానికి గాను 1904 లో 22 ఏళ్ల వయసులో మొదటిసారిగా ఇండియా వొచ్చాడు. తల్లిదండ్రుల ఇష్టానికి విరుద్ధంగా అప్పటికే భారతీయ తాత్విక ధోరణి పట్ల సానుకూల దృక్పథం కలిగిన స్టాక్స్ క్రైస్తవ సన్యాసిగా నిరాడంబరంగా ఆ పర్వత ప్రాంతాల్లో ఉండే ప్రజలతో జీవించాడు. వాళ్ల కోసం స్కూల్ ప్రారంభించాడు. ప్రభుత్వ ప్రోత్సాహంతో స్థానికంగా ఎన్నో కార్యక్రమాలు రూపొందించాడు. స్వయంగా స్థానిక భాష నేర్చుకున్నాడు. భూస్వాములు, పెత్తందార్ల దోపిడీని వ్యతిరేకించాడు. స్వాతంత్ర పోరాటంలో కూడా భాగమయ్యాడు. స్వయంగా మహాత్మాగాంధీజీ ప్రశంసలకు పాత్రుడయ్యాడు. హిమాచల్ లోని కోటగర్ ప్రాంతంలో ఆనాటి ప్రజల స్థితిగతులు దయనీయంగా ఉండేవి. వారికంటూ నిర్దిష్టమైన సంపద ఉండేది కాదు. వ్యవసాయం అంతంత మాత్రంగా ఉండేది. ప్రకృతి మీద ఆధారపడి బతుకుబండి వెల్లదీసే వారు. అలాంటి సమయంలో అమెరికా నుండి స్టాక్స్ యాపిల్ విత్తనాల్ని తీసుకొచ్చి ఎన్నో ప్రయోగాలు చేసి అక్కడి నేలకు అనువైన రకాలని సాగు చేయడం ప్రారంభించాడు. అంతే, ఈ రోజు ఒక్క సిమ్లా మాత్రమే కాదు, అటు కాశ్మీర్ నుండి ఇటు సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ వరకూ ప్రతి ఏటా కొన్ని లక్షల ఎకరాల్లో కోట్ల రాబడితో పండుతున్న యాపిల్ పండ్లకు మూలం సుమారు వందేళ్ల క్రితం స్టాక్స్ చేసిన పరిచయం ఆ మొదటి యాపిల్ పంట మాత్రమే. బైబిల్ ఆదిమ కాండంలో నిషేధిత ఫలాన్ని తినడం మనిషి చేసిన పాపం అని ప్రతీతి. కానీ అదే బైబిల్ ను నమ్మిన ఒక విదేశీయుడు నాటిన ఫలం ఈరోజు కొన్ని లక్షల ఎకరాలకు విస్తరించి కోట్లాది మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధిని అందిస్తోంది.

యాపిల్ ఆధారంగా భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్న న్యూటన్ లోకానికి ఎంత గొప్పో, యాపిల్ పంటతో భూమిని సద్వినియోగం చేయడం నేర్పి రైతాంగానికి సాధికారతను కూర్చిన స్టాక్స్ కూడా ఈ దేశానికి అంతే గొప్ప. కానీ, దురదృష్టవశాత్తూ ఈ రోజు స్టాక్స్ ఈ దేశంలో అపరిచితుడు. దేశం స్వాతంత్రం పొందడానికి కొద్దిరోజుల ముందు మే 14, 1946 న మరణించిన స్టాక్స్ కి ఒకట్రెండు విగ్రహాలు, విద్యాసంస్థలకు ఆయన పేర్లు తప్పా ఆయన గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆయన భార్యా, పిల్లలు, తర్వాత మనుమలు మనువరాళ్ల తరాలు కూడా ఈ దేశంతో కలగలిసిపోయారు. లాలా లజపతి రాయ్ వంటి దేశ నేతలతో పాటు ఆలిండియా కాంగ్రెస్‌లో ప్రాతినిధ్యం వహించి, ఈ దేశ స్వాతంత్రం కోసం కారాగార శిక్ష అనుభవించిన స్టాక్స్, చివరివరకు భారతీయుడిగానే జీవించాడు. మత మార్పిల్లంటూ నాటకాలు ఆడే ఈనాటి మతోన్మాదులకు చంప పెట్టుగా సుమారు వందేళ్ల క్రితం హిందూ మతం స్వీకరించి తన పేరును సత్యానంద్‌గా మార్చుకున్న మహావ్యక్తి స్టాక్స్. నిజానికి స్థానిక ప్రజల ఒత్తిడి మేరకు ఒక విధంగా కులాన్ని కూడా పాటించిన స్టాక్స్ ' శుద్ధి' చేసుకుని స్వీకరించింది మరో మతాన్ని కాదు, మానవత్వాన్ని.

అందుకే, ఆనాటి వరకు ఎన్నడూ జరగని విధంగా ఒక విదేశీయుడై ఉండి ఈ దేశం మూల తత్వాన్ని అర్థం చేసుకుని, ఏ మతానికి చెందని విధంగా చరిత్రలో మొట్ట మొదటి సారిగా మనిషి వైపు నిలిచే దైవం కోసమంటూ ఒక గుడిని ధైర్యంగా నిర్మించ గలిగాడు. ఒక విదేశీయుడిగా ఈ దేశంలో స్టాక్స్ భౌతికంగా నిర్మించింది అసమానతలు లేని బడి, తారతమ్యాలు లేని గుడి ఐతే, భావజాల పరంగా నిర్మించింది అరమరికలు లేని ఒక ప్రేమస్పద వసుధైక కుటుంబ వ్యవస్థ గురించిన ఆచరణాత్మక ఆకాంక్షని. దానిని అమలు చేసే క్రియాశీలక చేతనాత్మక పాత్రే సత్యానంద స్టాక్స్ మొత్తం జీవితాంతం సాగించిన అవిరామ యాత్ర. ' సత్యకామ ' పేరుతో ఉద్గ్రంథం రచించిన స్టాక్స్ జైల్లో ఉండగానూ, బయటా కూడా అనేక రచనలు చేశాడు. సత్యానంద్ స్టాక్స్ అపురూప జీవితం, కృషి కోసం కూడా పరిశోధించి రాసిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వ్యక్తిగతంగా ఆశా శర్మ ఎన్నడో రాసిన An American in Gandhi's India/An American in Khadi ఎంతో హృద్యంగా రాసిన సత్యానంద్ స్టాక్స్ జీవిత కథ. ఆమె తల్లికి అంకితం ఇస్తూ ఆ పుస్తకంలో అన్న మాటలు, Dedicated to my mother Champavathi, Quaker by Heritage, Christian by Spirit, Karmayogi in Life మొత్తం స్టాక్స్ కుటుంబ స్ఫూర్తికి, ఆయన వ్యక్తిగతంగా చేసిన అద్భుతమైన అన్వేషణా ధాత్రికి తిరుగులేని నిదర్శనం.

ఆగస్టు 16, 1982 న స్టాక్స్ శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కురుస్తున్న వర్షంలో సైతం వందలాది మంది అభిమానులు సుదూర ప్రాంతాల నుండి కాలినడకన " సాబ్ జీ " కి నివాళులు అర్పించడానికి ఉవ్వెత్తున పరుగులు తీస్తూ రావడం చూసిన నాటి హిమాచల్ ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్టాక్స్ ని, " పర్వత ప్రాంత యేసు ప్రభువు " (Messiah Of The Hills) గా వర్ణించాడంటే స్టాక్స్‌కి ఆ ప్రాంతంతో ఉన్న అనుబంధం ఏమిటో అర్థమౌతుంది. స్టాక్స్ జీవితం గురించిన ప్రజలు స్వయంగా అల్లుకు సృష్టించుకుని పాడుకునే గీతాలు కూడా ఈనాటికి వినిపిస్తాయి. ఆయన భార్య కూడా అక్కడే జీవించి చనిపోయింది. స్టాక్స్ స్మృతి చిహ్నంగా నిర్మించాలని చివరి వరకు తపించిన స్టాక్స్ సమాధి కానీ, గ్రంథాలయం కానీ, ఈనాటి దాకా కనీస నిర్మాణానికి నోచుకోలేదు. ఆయన సంతతి రాష్ట్ర రాజకీయాల్లో నాయకత్వ స్థానంలో ఉన్నప్పటికీ స్టాక్స్ స్మృతి చిహ్నాల పై ఎందుకో దృష్టి పెట్టలేదు. ఈ రోజు ఎవరు పట్టించుకోని పరంజ్యోతి దేవాలయం మాత్రం స్టాక్స్ ఫార్మ్ దగ్గర్లో మిగిలి ఉంది. నర్కుంద అనే చిన్న పట్టణం దగ్గర్లో ఉన్న గ్రామంలోని ఈ ఆలయం అచంచలమైన దైవాతీత మానవతావాద మహాసంకల్పానికి మరో రూపం. ఒక్క హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రమే కాదు, ప్రపంచంలో ఒక విదేశీయుడు మనిషి ఆంతరిక ఆధ్యాత్మిక అన్వేషణకు దర్పణంగా, తన అంతర్గత చింతనకు ఆలవాలంగా నిలిపిన, మరెక్కడా లేని అద్వితీయమైన మహోన్నతమైన నిలయం అది. వ్యాపారాలకు, వైషమ్యాలకు అతీతంగా ఈనాటికీ నిలిచిన ఆ చిన్న సౌధం, సాటి మనుషుల్ని ప్రేమించడం, తోటి వారి మంచిని కాంక్షించడమే, మతాలకు అతీతంగా మానవాళికి అందించే మహా సందేశం.

( ఎన్నిసార్లు హిమాచల్ వెళ్ళినా ఎప్పుడూ ఎందుకనో కుదరలేదు. చాలాకాలం నుండి అనుకుంటున్నా కానీ ఇన్నాళ్ళకిల్లా సాధ్యమైన పయనం ఇది. ముఖ్యంగా సత్యానంద్ స్టాక్స్ జీవిత చరిత్ర చదివిన నాటి నుండి వెళ్ళొద్దామని అనుకున్న చోటు ఇది. ఈ మధ్య జనించిన శారీరక బలహీనతలు, ఇతరేతర పని ఒత్తిళ్ల వల్ల ఒకందుకు వెనకడుగు వేసినా, మొత్తానికి మొన్న అకస్మాత్తుగా అనుకోని ప్రయాణంలో మిత్రుడు సతీష్ తో కలిసి స్టాక్స్ ఫామ్, పరంజ్యోతి ఆలయంతో పాటు సిమ్లా, కాజా, ప్రపంచంలోనే అతి ఎత్తైన ప్రాంతం కామిక్, హిక్కిం...వంటి చోట్లు చుట్టేశాను. లోతైన సంస్కృత తాత్విక వాక్యాలతో నిండిన ఈ వింత నిర్మాణాన్ని దర్శించడంలో ఆంతర్యం నా మనసులో చిరకాలంగా దాగున్న నిగూఢ మానవీయ సౌందర్య చింతనను సంతృప్తి పరుచుకోవడం మాత్రమే. అందులో భాగంగా ఇప్పటికైనా సత్యానంద్ స్టాక్స్ అపురూప జీవితం ఈ దేశ స్వాతంత్రం కోసం ఇక్కడి ప్రజల కోసం అహర్నిశలు చేసిన ఆయన కృషి రాబోయే తరాలకు తెలియాలని, అందుకోసం ఆలోచనాపరులు, పాలకులు నిజాయితీగా ప్రయత్నించాలని ఆశిస్తూ ఆయన గురించిన చిరు పరిచయంతో ఈ చిన్న రైటప్.)

**- గౌరవ్**

## ఈఓ అవినీతికి అడ్డుకట్ట వేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం ఆలయ ఈవో, అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆలయ అనువంశిక అర్చకులు నాయుడు గారి రాజశేఖర్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయన మాట్లాడారు. గత దశాబ్ద కాలంగా ఆలయ దేవదాయ శాఖ ఈవోలు, ఇతర బ్రోకర్స్ ఇక్కడ భక్తుల నుండి అన్నదానానికి విరాళాలు వసూలు చేస్తున్నారు. అయితే ఇప్పటికి నేను అనువంశిక అర్చకులుగా వందసార్లు చెప్పిన ప్రయోజనం లేకపోయిందన్నారు. గత మూడేళ్లుగా ప్రస్తుత ఈవో ప్రభాకర్ కొంతమంది తమ కుటుంబీకులతో కలిసి యదేచ్ఛగా అన్నదానానికి విరాళాలు వసూలు చేస్తున్నారన్నారు. అసలు రాష్ట్ర దేవదాయ శాఖ జాబితాలో ఈ ఆలయానికి నిత్యాన్న దాన పథకం అనేది లేదన్న విషయం భక్తులు తెలుసుకోవాలన్నారు. వీటిని గమనించి భక్తులు అన్నదానానికి విరాళాలు ఇవ్వవద్దన్నారు. స్వామివారి పవిత్రతను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. దీనివల్ల చాలామంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ అవినీతి



కట్టడి చేయాలంటే మీడియా ప్రచారం తప్ప మరో మార్గం లేదన్నారు. ఇక నిత్యం జరుగుతున్న ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆఫ్లైన్ టికెట్స్ అమ్మకంలో అవినీతి మనీ ఆర్డర్స్ ద్వారా విరాళాలు సేకరిస్తున్నారన్నారు. ముఖ్యంగా 2023 నుంచి 2025 వరకు జరిగిన మహాశివరాత్రి కార్తీక మాసం ఉత్సవాల్లో సుమారు రూ.కోటికిపైగా ఈవో కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. అర్చకులకు మీడియాకు తెలియని విధంగా జమ ఖర్చుల రూపంలో లక్ష రూపాయలు పనికి 10 లక్షలు చెక్కులు వెనక నుండి తీసుకోవడం వంటి రహస్య అవినీతి వ్యవహారాలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి అవినీతిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పోరుబాట విజయవంతంపై ధన్యవాదాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కేంద్రంలో వైకాపా యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "యువత పోరు నిరసన ర్యాలీ" విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరుద్యోగ భృతి, ఉద్యోగాలపై నినాదాలు చేస్తూ జిల్లా కేంద్రాన్ని ప్రకంపించించిన యువతకు జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, యువజన విభాగాల నాయకులు, ప్రత్యేకంగా నరసన్నపేట నుండి 300 బైకుల బృందంతో ర్యాలీగా వచ్చిన యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, అలాగే రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్, జిల్లా యువజన అధ్యక్షులు మార్పు పృథ్వీలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుండి స్వచ్ఛందంగా విచ్చేసి తమ ఉనికిని చాటిన ప్రతి ఒక్క యువకుడికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. యువత శక్తిని ప్రదర్శించిన ఈ పోరాటం కూటమి ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు.




## అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల శ్రీకాకుళం 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ విభాగాల్లో గల ఖాళీలకు భర్తీ చేసేందుకు అతిధి అధ్యాపకుల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు మంగళవారం ప్రకటనలో తెలియజేశారు. బయోటెక్నాలజీ యూజీ విభాగంలో-1, ఎం.ఎస్సీ మెడికల్ బయోటెక్నాలజీలో-2, కంప్యూటర్‌సైన్స్‌లో 3ఖాళీలు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. సంబంధిత విభాగాలలో పీజీ పూర్తి చేసిన వారు అర్హులని, నెట్ లేదా సెట్ కలిగి ఇంగ్లీషులో ప్రావీణ్యం కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను ఈనెల 30వ తేదీలోగా కళాశాలకు అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# తెప్పలవలసలో "కార్యకర్తే కీలకం"

(సత్యంన్యూస్, రణస్థలం)

"కార్యకర్తే కీలకం"కార్యక్రమంలో భాగంగా ఐదవరోజు తెప్పలవలస పంచాయితీ కార్యకర్తలలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ భరోసా నింపారు. ఈమేరకు మంగళవారం రణస్థలం క్యాంపు కార్యాలయంలో తెప్పలవలస పంచాయితీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే వ్యక్తి కార్యకర్తే అని కొనియాడారు. వైకాపాలో ప్రతీ కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటామని, ఏ కార్యకర్త కూడా అధైర్య పడవద్దన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏడాది గడవకముందే వ్యతిరేకత మూటగట్టుకుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ప్రతీ కార్యకర్త వివరించాలన్నారు. సంపద సృష్టించి పేదలకు పంచుతానన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైన సూపర్ సిక్స్ అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు వస్తాయని ఆ కష్టాలను ఎదుర్కొని నిలబడటమే లీడర్ అవుతారని కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించాలని వాటిని పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు, నాయకులు మీసాల గాంధీ, అబోతుల రాము నాయుడు, యాగాటి తవుడు, తోట ఆదినారాయణ, తోట అప్పన్న, ధర్మవరపు సింహాద్రి, పట్నాన పెంటయ్య రెడ్డి, యాగాటి అప్పయ్య, చోడవరపు అచ్చోడు, లంక రమణ, కొయ్య తవుడు, గొర్లె శ్రీరాములు, ఇజ్జురోతు శ్రీరాములు, దన్నాన కృష్ణ, దన్నాన సన్యాసి రావు, లంక తవుడు, అబోతుల రవి, సారికి సురేష్, బొంతు రమణ, చోడవరపు రామారావు, వనం తాతారావు, గొర్లె సన్యాసి రావు, మూలుగు రాజు, దన్నాన మురళి, సారికి జానీ, రెల్లి కోటి, గేదెల సింహాచలం, వనం అప్పల నరసయ్య, వనం మణి, సంకురోతు అసిరినాయుడు, బోనేల రామారావు, మీసాల సత్యం, మీసాల అప్పల నాయుడు, గొర్లె లక్ష్మణ, మీసాల సత్యారావు, యామల రమణ, సిమ్మాల సూర్యనారాయణ, యాగాటి కృష్ణ, యాగాటి నాగరాజు, యామల కృష్ణ, బొమ్మలాట వంశి, కుప్పిలి మురళి, యామల రమణ, దుంగ శ్రీరాములు, యామల మధు, యాగాటి శ్రీను, తోట కృష్ణ, తోట అప్పన్న, మజ్జి కురామయ్య, తోట బోడయ్య, ధర్మవరపు లక్ష్మి నారాయణ, ఉల్లూరు లక్ష్మణ, పట్నాన జయరెడ్డి, ముద్దాడ సంతోష్, ముద్దాడ అప్పారావు, యాగాటి రామయ్య, ఉప్పల అచ్చిబాబు, పోతల శ్రీను, మంగం ఈశ్వర రావు, టొంపల ఈసు, కరగాన రాము, ముద్దాడ పండు, బాణాపురపు సీమయ్య తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# నరసన్నపేట జీజేసీ విద్యార్థులకు ర్యాంకుల పంట



- కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఎంట్రన్స్ పరీక్షలో ప్రతిభ
- ఏపీఆర్డీసీ ఎంట్రన్స్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు
- కర్నూలు సిల్వర్ జూబ్లీకి నలుగురు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాలకు ముగ్గురు ఎంపిక
- అభినందించిన ప్రిన్సిపాల్ పవన్

(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలలో సత్తా చాటారు. కర్నూలులోని ప్రతిష్టాత్మకమైన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు పోటీ పడతారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన కళాశాలలో డిగ్రీ చేరేందుకు గత నెలలో నిర్వహించిన సిల్వర్ సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పవన్ తెలిపారు. సీఈసీ గ్రూప్ చదివిన కొంకి రాంబాబు 42వ ర్యాంకు రాగా, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఒకేషనల్) గ్రూప్ చదివిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వాడవలస రామకృష్ణకు 135వ ర్యాంకు, బోర షర్మిలకు 152వ ర్యాంకు రాగా పీట యమునకు 414వ ర్యాంకు (స్పోర్ట్స్ కోటా) వచ్చాయన్నారు. అలాగే ఇటీవల విడుదలైన ఏపీఆర్డీసీ ఎంట్రన్స్ ఫలితాల్లో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఒకేషనల్) గ్రూపు విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఏ అండ్ టీ గ్రూపు చదివిన బుడ్డాల రవీంద్ర, వాడవలస రామకృష్ణ, ఉంగటి లాలూప్రసాద్ లకు నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో బీకాం సీట్లు లభించాయనీ తెలిపారు. తమ విద్యార్థులు కర్నూలు సిల్వర్ జూబ్లీకి నలుగురు, నాగార్జున సాగర్ డిగ్రీ కళాశాలకు ముగ్గురు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ మరపట్ల పవన్ హర్షం వ్యక్తంచేశారు. ఏ అండ్ టీ వృత్తివిద్య అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి, జీఎఫ్‌సీ కూన హరిప్రసాద్, స్వర్ణలత, ఆనందరావు విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి ర్యాంకులు సాధించేలా కృషి చేస్తున్నారనీ అభినందించారు. డాక్టర్ మల్లేశు, రూపవతి, సత్యనారాయణ, జోశ్యుల హరిప్రసాద్ సహకారంతో సీఈసీ గ్రూపులో టాపర్ అయిన కొంకి రాంబాబుకి 42వ ర్యాంకు రావడం పట్ల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు జే.వదనగిరి, అధ్యాపకులు విశ్వప్రసాద్, శివరాం ప్రసాద్, నాగకుమారి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

తొలగించిన ఉద్యోగులను

# వెంటనే పనిలోకి తీసుకోవాలి



(సత్యంన్యూస్, రణస్థలం)

పైడిభీమవరం శేషసాయి కెమికల్స్ పరిశ్రమలో అక్రమంగా తొలగించిన 11 మంది ఉద్యోగులను వెంటనే తీసుకోవాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు అమలుచేయాలని సిటు జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ పరిశ్రమలో ఏకపక్షంగా నిలుపుదల చేయడంతో కార్మికులు పరిశ్రమ ముందు ఆందోళన చేపట్టారు. కార్మికులు పోరాటానికి సిటు తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. పరిశ్రమలో ఉద్యోగులకు, కార్మికులకు పీఎఫ్, ఐఎస్ఐ, బోనస్, వీడీఏ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయడం లేదని అన్నారు. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తూ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తుందని అన్నారు. చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని కోరితే ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా 11 మంది ఉద్యోగులను నిలుపుదల చేసిందని, యాజమాన్యం వెంటనే కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జనార్ధనరావు, ఎ.నారాయణరావు, సిహెచ్ అమ్మలనర్సయ్య, బి.రాజారావు, ఎం.అప్పలరాజు, జి.శశిధర్, ఆర్.పవన్ సీతారాం, ఐ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


## అద్దెకు ఇవ్వబడును

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అడుగులు (20×60)

- వివరాలకు సంప్రదించగలరు -

9866 222 636


డిమాండ్స్ పరిష్కరించకపోతే

# పోరాటం ఉధృతం




(సత్యంన్యూస్, మందస)

మందస జీడి కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని వక్తలు అన్నారు. జీడి కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ జీడి కార్మికులు నిర్వహించిన ర్యాలీకి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. సిటు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ జీడి కార్మికులు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని, యాజమాన్యాలు కార్మిక చట్టాలు తుంగలో తొక్కి తీవ్ర దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. 18 నెలల గడిచినప్పటికీ యాజమాన్యాలు చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నయని విమర్శించారు. మరోవైపు యాజమాన్యాలు అక్రమంగా వేరే ప్రాంతాల్లో కాల్పులు జరిపించి చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముప్పై ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు పని ఇవ్వకుండా అక్రమ పద్ధతిలో వేరే ప్రాంతాలకు తరలించడం చట్ట వ్యతిరేకమని, ప్రభుత్వం దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిటు మండల కార్యదర్శి కె.కేశవరావు, జీడి సంఘం నాయకులు సీహెచ్ చంద్రమ్మ, సీహెచ్ జానకమ్మ, కె.శాంతమ్మ, గోపమ్మ, కె.సరస్వతమ్మ, ఎం.దానమ్మ, బి.హేమలత, మడ్డు కళ, మడియా దమయంతి, రైస్ మిల్లు సంఘం నాయకులు కె.బాలకృష్ణ, ఆర్.ఏకాసి, కూర్మారావు, బి.దుర్యోధన, కె.కృష్ణారావు, ఎం.ధర్మారావు, ఎన్.లచ్చయ్య, పోలయ్య, లోకేసు, బి.లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.




టెక్కలి మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి ప్రజా గొంతుకై వివిధ శాఖల అధికారులకు ప్రజా సమస్యలు తెలిపారు. సమావేశంలో టెక్కలి ఎంపీడీవో ఫణీంద్ర, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యంన్యూస్-టెక్కలి

# సొంత మండలానికి బదిలీ చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రూరల్ పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయంలో గ్రేడ్–3 ఎన్ఎంలుగా పని చేస్తున్న తమకు సొంత మండలానికి ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం కల్పించాలని రూరల్ పీహెచ్‌సీ వైద్యాధికారిని కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు. జీవో నెం.5 ప్రకారం సాధారణ బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో వార్డు సచివాలయం వారికి పక్క వార్డు సచివాలయానికి ట్రాన్స్‌ఫర్ చేసుకోడానికి అవకాశం కల్పించారని, అలాగే రూరల్‌లో పని చేస్తున్న తమకు కూడా సొంత మండలాలకు ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. వైద్యాధికారిని కలిసినవారిలో బి.శ్రావణ, ఎస్.రంగమ్మ, జె.మాధవి తదితరులు ఉన్నారు.



# వ్యక్తిగత గోప్యతకు పెరుగుతున్న సవాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

గోప్యతకు సంబంధించిన విషయాలు, వివరాలు సాధారణంగా బిగ్ డేటా అనలిటిక్స్ రంగంలో పని చేసే వారికి, వారి పరిశోధనలకు ముడి సరుకుగా ఉపయోగపడతాయి. ఇలా సేకరించిన డాటా ఆధారంగానే 2014లో మోడీ, 2016లో ట్రంప్ వంటి రాజకీయ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే వ్యూహాలు రూపొందించుకోవడానికి వాడుకున్నారు. మరో కోణంలో ఈ విధంగా గుత్తగా సేకరించిన కోటానుకోట్లకు సంబంధించిన వ్యక్తిగత వివరాల ఆధారంగానే అంతర్జాతీయంగా సరుకులు అమ్ముకునే కంపెనీలు- మొబైల్ కంపెనీలు, ఐకియా వంటి ఫర్నిచర్ దుకాణాలు, ఇతర వినియోగ సరుకులు ఉత్పత్తి చేసే కంపెనీలు తమ తమ సరుకులు అమ్ముకోవడానికి వినియోగదారుల అభిరుచుల గురించిన విశ్లేషణలు చేస్తాయి. అటువంటి అధ్యయనాల ఆధారంగా కస్టమైజ్ చేసిన మెసేజ్లు పంపుతూ ఉంటాయి.

అంతటితో ఆగితే ఓ మేరకు హమ్మయ్య అనుకోవచ్చు. కానీ ఇలా హ్యాకర్ల ద్వారా గుట్టలు గుట్టలుగా సేకరించిన ఫోన్ నంబరులు, ఈమెయిల్ వివరాలకు స్పామ్ (ఎందుకూ పనికిరాని) మేసేజ్‌లను ఏదో ముఖ్యమైన మెసేజులుగా పంపి, వాటిని తెరవడానికి ప్రయత్నం చేసిన వెంటనే మన కంప్యూటర్లు మొబైల్ ఫోన్‌లకు వైరస్‌ను జత చేస్తాయి. ఆ తర్వాత మన చేతుల్లో ఇళ్లల్లో ఉన్న ఇంటర్నెట్ ఆధారిత సాధనాల మీద మన నియంత్రణ లేకుండా పోతుంది. కార్పొరేట్ వైరుధ్యంలో భాగంగా పోటీ కంపెనీలు తమ తమ కార్యాలయాల్లో ఉపయోగించే కంప్యూటర్లు, వర్క్ ఫ్రం హోం స్కీంలో భాగంగా గ్రామాల వద్ద పనిచేసే సిబ్బందికి ఇచ్చిన కంప్యూటర్లను పనికిరాకుండా చేయగలవు. ఈ మధ్యనే అమెరికాకు చెందిన ఓ కంపెనీ డాటా బేస్ మీద హ్యాకర్లు దాడి చేశారు. దీంతో అంతర్జాతీయంగా సేవలు అందించే ఆ కంపెనీ దాదాపు రెండు వారాలకు పైగా తమ కస్టమర్లకు సేవలు అందించలేకపోయింది.

వారం రోజుల క్రితం ఇరాన్‌పై దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్ తన దాడులను కేవలం సాయుధ సైనిక చర్యలకు మాత్రమే పరిమితం చేయలేదు. ఇరాన్ వద్ద భద్రపరచిన కోట్ల విలువైన డిజిటల్ కరెన్సీ (క్రిప్టోకరెన్సీ)ని కూడా దొంగిలించిందని స్వయంగా ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు పౌరుల వ్యక్తిగత గోప్యతను కాపాడటానికి, అంతర్జాతీయంగా జరుగుతున్న అంతర్జాల చోరీలను నిలువరించడానికి, పెరుగుతున్న సైబర్ నేరాలను కట్టడి చేయటానికి సమగ్ర రక్షణ వ్యవస్థలు రూపొందించాల్సిన విషయాన్ని తాజా 140 కోట్ల మందికి సంబంధించిన వివరాలు చోరీ అయిన ఉదంతం ముందుకు తెస్తోంది.

# యాడ దొరికిన సంతరా మీరంతా!

(మొదటిపేజీ తరువాయి)

తక్కువే. అయితే డీఎంహెచ్‌వో ఆఫీసులో ప్రతీ పనికి ఓ రేటు వసూలుచేసే బ్యాచ్‌కు, బాబూరావుకు మధ్య ఏమాత్రం పొసగడంలేదు. సంబంధిత క్లర్క్ ఫైల్ తయారుచేసిన తర్వాత సూపరింటెండెంట్ సంతకం చేసి ఏవో ఓకే అంటేనే డీఎంహెచ్‌వో టేబుల్ మీదకు ఫైల్ వెళ్తుంది. అయితే అయినదానికీ, కానిదానికీ ఏవో కొర్రీలు పెట్టి ఫైల్ వెనక్కు పంపుతున్నారనేది వీరి వాదన. ప్రతీ దానికి ఓ రేటు ఫిక్స్ చేసి అందులో తన వాటా కూడా ఉందని వసూలు చేస్తున్నందునే తిరస్కరిస్తున్నట్లు బాబూరావు భావన. ఏది ఏమైనా రెండు గ్రూపులుగా ఏర్పడి డీఎంహెచ్‌వో ఆఫీసులో తన్నుకుంటున్నారు. అకౌంట్స్ సూపరింటెండెంట్ కె.శివకుమార్‌కు ఈ వ్యవహారాలతో సంబంధం లేకపోయినా బాబూరావుకు కొమ్ముకాస్తున్నారని, 2024 మార్చి 6న ఏవోగా చేరిన బాబూరావు మినిస్టీరియల్ ఉద్యోగులను దుర్భాషలాడుతూ అగౌరవపరుస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పనిలో పనిగా బాబూరావుకు సంబంధంలేని వ్యవహారాలను కూడా ఇందులో కలిపేశారు. అర్బన్ పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకానికి గత ఏడాది ఫిబ్రవరి 27న జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసిన మేరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజినల్ లిస్టును తయారుచేసిన తర్వాత బాబూరావు ఆ ఫైల్‌ను తొక్కిపెట్టేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఏ పద్ధతిలో నియామకానికైనా డైరెక్టరేటే నోటిఫికేషన్ ఇస్తుందని, జిల్లాలవారీగా ఖాళీల భర్తీని నిలుపుదల చేయాలంటూ వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేటే ఆదేశాలివ్వడంతో ఈ నియామకాలు నిలిచిపోయాయి. అయితే ఇందుకు బాబూరావే బాధ్యుడని కూడా ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయానికి వచ్చి ఎఫ్ఆర్‌సీ పూర్తయిన తర్వాత బయటకు వెళ్లిపోతారని, దీనివల్ల ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోతున్నాయంటూ ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి బాబూరావు, భాస్కర్‌కుమార్ ఒకే సామాజికవర్గానికి చెందినవారు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరులో గ్రూపులు ఏర్పడిన మాట వాస్తవం. అయితే వైద్యఆరోగ్యశాఖ పరిధిలో సామాన్య ఉద్యోగి మాత్రం వీరి గొడవల మధ్య నలిగిపోతున్నాడు.

బాబూరావు కార్యాలయంలో తన కింది ఉద్యోగులను వేధిస్తున్నారనడానికి ఉదాహరణగా మరో ఫిర్యాదును దీనికి జతచేశారు. 2022 నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పని చేస్తున్న ఓ మహిళా సీనియర్ అసిస్టెంట్ ఏవో తనను మిగిలిన ఉద్యోగుల సమక్షంలోనే దుర్భాషలాడుతున్నారని మరో ఫిర్యాదు అందించారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఇటీవలే పదోన్నతి పొందిన తనకు ఏవో కోర్టు డ్యూటీలు కూడా వేస్తున్నారని, తరచూ విజయవాడ పంపుతున్నారని, మహిళనని కూడా చూడకుండా కించపరుస్తూ మాట్లాడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బహుశా ఈమె ఫిర్యాదు మేరకు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో దర్యాప్తు చేపడితే బాబూరావుపై చర్యలుంటాయని భాస్కర్ కుమార్ వర్గం భావిస్తోంది. అయితే బాబూరావు కూడా సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ బ్యాచ్‌కు సంబంధించిన అక్రమాల ఆధారాలు కూడా పైకి పంపినట్లు తెలుస్తుంది. ప్రస్తుతానికి ప్రతీరోజు డీఎంహెచ్‌వో ఛాంబర్ ముందు, వీలైతే డీఎంహెచ్‌వో ముందే వీరు బాహాబాహీకి దిగడం వల్ల కార్యాలయంలో పనిచేసే వాతావరణం పూర్తిగా పాడైపోయింది.






# వ్యక్తిగత అవార్డులతో మెరిసిన సిక్కోలు సేవకులు

- జోన్ 4 మిడ్ కాన్ 2025లో జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ హవా
- జోన్ అధికారి జేసీ బగాది ప్రవీణ్ కుమార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వ్యక్తిగత అవార్డులతో జేసీఐ సిక్కోలు సేవకులకు అరుదైన ప్రశంసలు లభించాయని జోన్ అధికారి జేసీ బగాది ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ జోన్ 4 మిడ్ కాన్ కార్యక్రమంలో భాగంగా జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ వ్యక్తిగత అవార్డులతో పాటుగా, సన్‌రైజర్స్ బృందానికి కూడా ప్రత్యేక అవార్డును సొంతం చేసుకుందని, అన్ని విభాగాలలో జేసీ సేవకులను గుర్తించి, ప్రశంసలందుకున్న జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ సమూహానికి ప్రత్యేక అభినందనలన్నారు. అధ్యక్షులు జేసీ సింగూరు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో



ప్రతీ సభ్యుని సహకారంతో గడిచిన వేసవిలో సుమారు 60 రోజులు ఏకధాటిగా ప్రజల దాహార్తిని తీర్చారని, యువతకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే బాధ్యతను తీసుకున్నారని, మత్తు పదార్థాల వాడకం వలన కలిగే నష్టాలను, తమ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చారని, సీపీఆర్‌పై అవగాహన, అన్నదాన కార్యక్రమాలు చేశారని అధ్యక్షులు జేసీ సింగూరు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, కార్యదర్శి సుదర్శన్ పట్నాయక్, కోశాధికారి ఐతం వెంకటేష్, ఇతర సభ్యుల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ లోకల్ ఆర్గనైజ్డ్ మెంబెర్, అధ్యక్షునిగా, ఉత్తమ కార్యదర్శిగా జేసీ సుదర్శన్ పట్నాయక్, ఉత్తమ సభ్యులుగా జేసీ వెంకటేష్ ఐతం, జేసీ జగదీశ్, ఉత్తమ మహిళా సభ్యురాలుగా జేసీ షర్మిల (ఉపాధ్యక్షురాలు), నూతన సభ్యునిగా జేసీ ఈశ్వర్ లోలుగు, బెస్ట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఆక్టివిటీస్, బెస్ట్ పీఆర్ అండ్ మార్కెటింగ్, రక్తదాన శిబిరాలకు అవార్డులు లభించాయని, ముఖ్యంగా జేసీ గీత శ్రీకాంత్, జేసీ డాక్టర్ వినోద్‌కుమార్ కూర్మన అందించిన సహకారం మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో సన్‌రైజర్స్ వ్యవస్థాపకులు, జోన్ ట్రైనర్ సంతోష్ దూసి, ఇతర జేసీ సభ్యులు, శ్రీకాకుళం సన్‌రైజర్స్ సభ్యుల బృందం పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.